క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే ప్రసన్న



కోవూరు: జిల్లా నూతన ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఎస్పీ బంగ్లాలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు ఉన్నారు.

శ్మశానాల్లో బోర్ల నిర్మాణం



పొదలకూరు : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు మొగళ్లూరులోని ముస్లిం, ఎస్సీల శ్మశాన వాటికల్లో బోర్లను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎంపీపీ నిధులతో బోర్ల నిర్మాణం చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కే కనసాయక్ వెల్లడించారు. నాయకులు యనమల శ్రీనివాసులురెడ్డి, ఆకుల గంగిరెడ్డి, ముస్లీం మతపెద్దలు కరిముల్లా, మాబాషా తదితరులు దగ్గరుండి బోర్లను వేయించారు.

పులికల్లులో గ్రామసభ



పొదలకూరు : పులికల్లు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జీవీ సుబ్బమ్మ అధ్యక్షతన గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి, జగనన్న స్వచ్ఛసంకల్పం, వర్మికంపోస్టు తయారీపై చర్చించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి మాధవి, వార్డుసభ్యులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కొడవలూరు: నార్తురాజుపాళెం వద్ద గురువారం సాయంత్రం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం సత్రం గ్రామానికి చెందిన బొల్లా అనిల్‌కుమార్(23) నెల్లూరులోని రాయల్ అనే బిల్డర్ వద్ద గత మూడేళ్లుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. బిల్డర్ రాయల్ లింగసముద్రం మండలం మొగలిచర్లలో ఇంటి నిర్మాణం చేపట్టారు. అక్కడికి నాలుగు ఫ్యాన్లు అవసరమవడంతో వాటిని తీసుకుపోయే బాధ్యతను అనిల్‌కుమార్‌కు అప్పగించారు. నాలుగు ఫ్యాన్లను బైక్‌పై పెట్టుకుని నెల్లూరులోని ఎన్‌జీఓ కాలనీ నుంచి గురువారం సాయంత్రం మొగలిచర్లకు బయలుదేరారు. నార్తురాజుపాళెం వద్ద ముందు వెళుతున్న లారీని అదుపుతప్పి ఢీకొనడంతో అనిల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. తొలు కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కొడవలూరు ఎస్సై జీ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక..

- గొంతు కోసుకొని వృద్ధుడి మృతి

పొదలకూరు: ఒంటరితనాన్ని భరించలేక మద్యానికి బానిసైన వృద్ధుడు గొంతుకోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన తాటిపర్తిలో చోటు చేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన ఎత్తపు భాస్కర్‌రెడ్డి(64) భార్య 15 ఏళ్ల క్రితం మృతిచెందింది. కుమారుడు శ్రీనివాసులురెడ్డి బుచ్చిరెడ్డిపాళెంలో స్వీట్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఒంటరిగా ఉంటున్న భాస్కర్‌రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తి చెంది గురువారం బ్లేడ్‌తో గొంతుకోసుకున్నాడు. ఇరుగుపొరుగు వారు గుర్తించి చికిత్సనిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎస్సై ఎస్‌కే కరిముల్లా కేసు నమోదు చేశారు. జీజీహెచ్‌లోని భాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని సీఐ సంగమేశ్వరరావు, ఎస్సై కరిముల్లా పరిశీలించారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

కోవూరు(విడవలూరు): విడవలూరు మండలం వావిళ్ల సచివాలయం పరిధిలోని అరుంధతీయవాడకు చెందిన గరికపాటి పెంచలయ్య ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ.10 వేలు నగదు మంజూరైంది. ఈ మొత్తాన్ని నామిని ప్రదీప్‌కు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు తాత ప్రభాకర్ శుక్రవారం అందజేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నిమ్మల కృష్ణయ్య, సునీల్, పెంచలమ్మ, తదితరులు ఉన్నారు.

దుర్ఘటన నుంచి గ్రామం కోలుకోవాలని..



మహాచండీయాగంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న మంత్రి కాకాణి దంపతులు, కుమార్తె పూజిత

పొదలకూరు: తాను జన్మించిన తోడేరు పడవ ప్రమాద దుర్ఘటన నుంచి కోలుకుని తిరిగి సుఖ సంతోషాలతో ఉండాలని వేదపండితుల సూచన మేరకు మహా చండీయాగాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తోడేరులోని శ్రీరామలింగేశ్వర చాముండేశ్వరి ఆలయంలోమంత్రి కాకాణి దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా చండీయాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు పడవ ప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. అలాంటి దుర్ఘటనలు తిరిగి ఎప్పటికీ జరగకూడదని తన కుమార్తె పూజిత యాగం చేయాలని తలపెట్టిందన్నారు. గ్రామస్తులు, అభిమానులు కలిసి యాగాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేశారన్నారు. తోడేరు గ్రామస్తులకు ఏ చిన్న ఆపద జరిగినా తన కుటుంబసభ్యులకు జరిగినట్లుగా భావిస్తానన్నారు. తన తండ్రి రమణారెడ్డి హయాం నుంచి ఈ అనుబంధం కొనసాగుతోందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి రాష్ట్రాన్ని పాలించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మంత్రి వెంట సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఎం.శ్రీనివాసులు, అట్ల రవీంద్ర, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎస్‌కే అంజాద్, ఎం.శేఖర్‌బాబు, యస్దాని, తదితరులు ఉన్నారు.

నాడు–నేడు పనులను వేగవంతం చేయాలి



బుచ్చిరెడ్డిపాళెం: నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసకుమార్



ముత్తుకూరు: మాట్లాడుతున్న ఎంఈఓ మధుసూదన్

బుచ్చిరెడ్డిపాళెం: నాడు–నేడు రెండో విడత పనులను వేగవంతం చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ ఏ శ్రీనివాసకుమార్ ఆదేశించారు. నగర పంచాయతీలోని డీఎల్ఎన్ఆర్ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, త్వరగా పూర్తి చేసేందుకు హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అదనపు తరగతి గదులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ నరసింహారావు, ఎంఈఓ దిలీప్, హెచ్ఎం నాగపద్మ, తదితరులు ఉన్నారు.

ముత్తుకూరు: మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు రెండో విడత పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ మధుసూదన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నాడు–నేడు రెండో విడత పనులపై హెచ్ఎంలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నాడు–నేడు రెండో విడత కింద రూ 11.75 కోట్లతో మండలంలోని 38 పాఠశాలల్లో పది రకాల సౌకర్యాలు, రెండు ఉన్నత పాఠశాలల్లో అదనపు గదులు, తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. అందులో రూ.3.07 కోట్లు విడుదల కాగా, ఇప్పటి వరకు రూ.1.85 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. ఈ నిధులను త్వరగా ఖర్చు చేస్తే మిగిలిన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఎంపీడీఓ ప్రత్యూష పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే హద్దు రాళ్ల ఏర్పాటు

కొడవలూరు: రైతుల సమక్షంలోనే హద్దు రాళ్ల ఏర్పాటు చేయాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో రీ సర్వేకు సంబంధించిన హద్దు రాళ్ల ఏర్పాటును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వివాదాలకు అవకాశం లేకుండా రైతుల సమక్షంలోనే హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. హద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియలో ఇప్పటికే జాప్యం జరిగినందున త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే చేపట్టని గ్రామాల్లో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆర్డీఓ వెంట డివిజినల్ సర్వేయర్ ముత్యాలు రాము, డీటీలు గున్నం మల్లికార్జున, మధుసూదన్‌రావు, మండల సర్వేయర్ మాబాషా, ఆర్ఐ చాణక్య, తదితరులు ఉన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ శీనానాయక్

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

తోటపల్లిగూడూరు: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైస్‌ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులనాయుడు పేర్కొన్నారు. మండలంలోని సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షిక వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సరస్వతి పూజ, ఆటల పోటీలను నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి విద్యతోనే సాధ్యమని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన అందించేందుకు నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులతో ముందుకు సాగాలన్నారు. తోటపల్లిగూడూరు సొసైటీ డైరెక్టర్ మద్దెన వెంకట సుబ్బయ్య నాయుడు, సర్పంచ్ చెరుకూరు సరళకుమారి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ స్వాతి, ఉపాధ్యాయులు షేక్ అహ్మద్‌బాషా, సుభాషిణి, వసంతలక్ష్మి పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న పోలీసులు

కొడవలూరు: కొడవలూరు పోలీసులు మానవత్వం చాటుకున్నారు. మతిస్థిమితం కోల్పోయి తప్పిపోయి వచ్చిన ఛత్తీస్‌ఘడ్ మహిళకు ఆశ్రయం కల్పించి బంధువులకు అప్పగించారు. ఎస్సై జీ సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు..ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వివాహిత పూజ(30)కు ముగ్గురు కుమారులు. ఆమెకు మతిస్థిమితం లేదు. ఈ ఏడాది జనవరిలో పాట్నా రైల్వేస్టేషన్‌లో రైలెక్కింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పాట్నా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా రెండ్రోజుల క్రితం కొడవలూరు మండలం నాయుడుపాళెం రైల్వే ట్రాక్ వద్ద మతిస్థిమితం లేని మహిళ తిరుగుతుండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జీ సుబ్బారావు, ఏఎస్సై ఎస్‌కే ఖదీర్‌బాషాతో కలిసి ఆ ప్రాంతానికి చేరుకుని ఆరా తీయగా ఆమె సరైన రీతిలో స్పందించలేదు. ఆమె వద్ద ఉన్న బ్యాగులోని ఆస్పత్రి రశీదు ఆధారంగా చిరునామాను ఆరా తీశారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం కొరియా జిల్లా కర్కొన గ్రామానికి చెందిన మహిళగా గుర్తించారు. పాట్నా పోలీసు స్టేషన్‌లోనూ మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలుసుకుని వారి ద్వారా బంధువులకు సమాచారం అందించారు. అనంతరం ఆమెకు బోగోలు మండలం ముంగమూరు రోడ్డులోని భవాని ఎడ్యుకేషనల్ సొసైటీలో ఆశ్రయం కల్పించారు. పాట్నా పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న పూజ కుటుంబ సభ్యులు శుక్రవారం కొడవలూరు చేరుకోగా ఆమెను అప్పగించారు. మూడు నెలలుగా కనిపించని మహిళ పోలీసుల ద్వారా దగ్గరవ్వడంతో బంధువులు ఆనందంగా వెంటబెట్టుకుని స్వగ్రామానికి బయలుదేరి వెళ్లారు.



మహిళను బంధువులకు అప్పగిస్తున్న ఎస్సై సుబ్బారావు

● ముస్లింల సంబరాలు



ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో బుచ్చిరెడ్డిపాళెంలోని ముస్లింలు శుక్రవారం రాత్రి సంబరాలు జరుపుకొన్నారు. ప్రధాన కూడలి వద్ద పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. –బుచ్చిరెడ్డిపాళెం

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

తోటపల్లిగూడూరు: మండలంలోని పేడూరు పంచాయతీలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శని, ఆదివారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమయ్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రంజాన్ శుభాకాంక్షలు

కోవూరు: రంజాన్‌ను పురస్కరించుకుని కోవూరు నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, ప్రతిఒక్కరికి అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

విడవలూరు తహసీల్దార్ బదిలీ

కోవూరు(విడవలూరు): విడవలూరు మండల తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీతారామపురం తహసీల్దార్ ఎం శ్యామసుందరరాజును నియమించారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇఫ్తార్ విందు



పొదలకూరు : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మొగళ్లూరులోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి గ్రామంలోని మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మతపెద్దలు కరిముల్లా, మాబాషా, పార్టీ నాయకులు యనమల శ్రీనివాసులు, ఆకుల గంగిరెడ్డి, చెన్నూరు గంగిరెడ్డి, ఆకుల హరి, జీ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఈద్ ముబారక్



పొదలకూరు మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావిఆకుపై వాటర్‌కలర్స్‌తో ఈద్ ముబారక్ చిత్రాన్ని రూపొందించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు ఈ విధంగా శుభాకాంక్షలు తెలిపారు.

–పొదలకూరు

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



కోవూరు: స్థానిక నందలగుంట ప్రాంతానికి చెందిన బుజ్జమ్మ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆమె కుమారుడు పక్షవాతంతో బాధపడుతున్నారు. అంత్యక్రియలకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న పచ్చిపాల శంకర్‌రెడ్డి సాయిసేవా ట్రస్టు నిర్వాహకులు ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు సభ్యులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పచ్చిపాల మల్లికార్జునరెడ్డి, వార్డు సభ్యులు పద్మ, కోవూరు శివాలయం ధర్మకర్త సుధాకర్, వలంటీర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి పంచలోహ కవచం బహూకరణ



మనుబోలు: స్థానిక విఘ్నేశ్వరాలయంలోని వినాయకుడికి పంచలోహ కవచాన్ని గ్రామానికి చెందిన పెనుగొండ సుధాకర్, శాంతి దంపతులు శుక్రవారం బహూకరించారు. అర్చకులు సాయకుమార్‌శర్మ విశేష పూజలు, హోమాలు నిర్వహించి విఘ్నేశ్వరుడికి కవచాన్ని అమర్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి.

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా వాటిని సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా గడప గడపకు చేరవేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కోవూరు నియోజక వర్గంలోని 55 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 66,083 గృహాలను సందర్శించినట్లు తెలిపారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తుండడంతో ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు సంతోషంగా ఆహ్వానిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జనరంజక పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌ను నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. చంద్రబాబు పిచ్చిపట్టి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర ఎల్‌డీఏ చైర్మన్ జీ విజయకుమార్ వైస్‌ఎంపీపీ కే లావణ్య, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ ఎస్ విజయలక్ష్మి, పార్టీ నాయకులుకే శ్రీనివాసులరెడ్డి, వెంకటశేషయ్య, కే శ్రీనివాసుల రెడ్డి,డీ చంద్రమోహన్‌రెడ్డి నరేంద్రరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకురెడ్డి, విజయ్‌భాస్కర్, ఎంపీడీఓ నాగేంద్రబా బు, సీఐ కే రామకృష్ణారెడ్డి, ఎస్సై వెంకటరాజేష్, సీడీపీఓ హేనా సుజన పాల్గొన్నారు.



దివ్యాంగులకు బైక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

త్రిచక్రాల మోటార్ బైక్‌ల పంపిణీ

విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గంలోని నలుగురు దివ్యాంగులకు త్రిచక్రాల బైక్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేసిన బైక్‌లను సద్వినియోగం చేసుకుని సాధారణ ప్రజలతో సమానంగా జీవనం సాగించాలని ఎమ్మెల్యే కోరారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ నాగరాజకుమారి పాల్గొన్నారు.

సోమిరెడ్డీ నీచ రాజకీయాలు మానుకో

- 153 మంది పార్టీలో చేరినట్లు నిరూపించే దమ్ముందా?
- సోమిరెడ్డికి మందల వెంకటశేషయ్య సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుండడంతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మతిభ్రమించి నీచరాజకీయాలు చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య విమర్శించారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సోమిరెడ్డి రాజకీయ జీవితమంతా అవినీతి, అక్రమాలు, నీచ రాజకీయాలతో కూడుకుందని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తుండడాన్ని చూసి జీర్ణించుకోలేకపోతున్నాడన్నారు. నెలకోసారి బయట నియోజకవర్గాల నుంచి అద్దెకు ఓటర్లను పిలిపించుకుని కండువాలు కప్పి సర్వేపల్లి నియోజకవర్గ ఓటర్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. శుక్రవారం వెంకటాచలంలో ముగ్గురు ఓటర్లు చేరగా, 153 మందిగా చెప్పుకోవడం సోమిరెడ్డి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. సోమిరెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే కండువాలు కప్పిన వారిలో ముగ్గురిని మినహాయించి మిగిలిన వ్యక్తులు సర్వేపల్లికి సంబంధించిన ఓటర్లని నిరూపించాలని సవాల్ విసిరారు. సోషల్‌మీడియాలో ఆర్భాటం తప్ప, ప్రజల మధ్య తిరుగుతూ వారి కోసం పనిచేసే వ్యక్తి సోమిరెడ్డి కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో సోమిరెడ్డికి సర్వేపల్లి టికెట్ ఇచ్చే పరిస్థితి కూడా లేదని ఆ పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, నాయకులు కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, చీకుర్తి నరసయ్య, తాటిపర్తి సురేష్, చిట్టమూరు శివకుమార్‌రెడ్డి, కడివేటి శివ, తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేక వేడుకలకు ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో ఈ నెల 27 నుంచి మే 3వ తేదీ వరకు జరుగనున్న మహాకుంభాభిషేక వేడుకలకు రావాలని పలువురు ప్రముఖులను ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు శుక్రవారం ఆహ్వానించారు. తొలుత ఇందుకూరుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె వెంకటదీపాకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.



మంత్రి కాకాణిని ఆహ్వానిస్తున్న ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు

అత్యవసర పనులు వెంటనే చేపట్టాలి

కొడవలూరు: గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన అత్యవసర పనులను వెంటనే చేపట్టాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలైన సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ నిర్మాణాలను ప్రారంభించని గ్రామాల్లో వెంటనే పనులు చేపట్టాలన్నారు. సింహభాగం భవనాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నందున త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు అందితే తక్షణమే అధికారులు స్పందించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు పీ సురేష్‌కుమార్, ఏ రమేష్, తాతారావు, పంచాయతీ కార్యదర్శులు జీ రాధాకృష్ణ, జాలయ్య పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న చలపతిరావు